సామాన్యుడి ఆయుధం
# ప్రజల అస్త్రం
తెలుగు దినపత్రిక
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ సంపుటి: 1 సంచిక: 322 పేజీలు: 6 మంగళవారం 8-4-2025 వెల: 5/రూ -

విలేకరులు కావలెను..

అస్త్రం తెలుగు దిన పత్రికలో పనిచేయుటకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలకు స్టాఫ్ రిపోర్టర్స్, నియోజకవర్గ ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు కావలెను.. సీనియర్ రిపోర్టర్స్ కి ప్రాధాన్యత ఇవ్వబడును.. మరిన్ని వివరాలకు సంప్రదించండి.

ఎడిటర్. 89193 45606

# ప్రపంచ మార్కెట్లు కుదేల్

- వెంటాడిన వాణిజ్య యుద్ధం, ఆర్థిక మందగమనం భయాలు
- భారత్‌సహా ప్రపంచవ్యాప్తంగా భీకర నష్టాల్లో సూచీలు
- 14.10 లక్షల కోట్లు కరిగిపోయిన మదుపరుల సంపద
- ఒక్కరోజే సెన్సెక్స్ 2,227, నిఫ్టీ 743 పాయింట్లు క్షీణత
- ఇంట్రా-డేలో 3,940.. 1,161 పాయింట్లు పతనం

స్టాక్ మార్కెట్లలో నష్టాలు ఏరులై పారాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెరతీసిన ప్రతీకార సుంకాలు.. సోమవారం భారత్‌సహా ప్రధాన ఆసియా దేశాల మార్కెట్లను బలితీసుకున్నాయి. ఇప్పటికే ఐరోపా, అమెరికా మార్కెట్లు టారిఫ్‌ల దెబ్బకు కుదేలైపోగా.. వరుస నష్టాలతో మదుపరులు బెంబేలెత్తిపోతున్నారు. ఈ ఒక్కరోజే లక్షల కోట్ల రూపాయల్లో మదుపరుల సంపద ఆవిరైపోయింది. అగ్రరాజ్యం దూకుడుకు దీటుగా చైనా, మరికొన్ని దేశాలు స్పందిస్తున్నాయి. దీంతో ఈక్విటీలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. సెన్సెక్స్ 2,227, నిఫ్టీ 743 పాయింట్లు పతనమైపోయాయి. ఆ రంగం.. ఈ రంగం అన్న తేడా లేకుండా అన్ని రంగాల షేర్లు నష్టాలకే పరిమితమైపోయాయి. ట్రంప్ దూకుడుకు దీటుగా చైనా, మరికొన్ని దేశాలు స్పందిస్తున్నాయి. దీంతో స్టాక్ మార్కెట్లు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఫలితంగా అమెరికా, ఆసియా, ఐరోపా సూచీల్లో భారీ అలజడే నెలకొంటున్నది.

2లో





అమరావతిలో

# 200 ఎకరాల్లో మెగా మెడిసిటీ

- ఖతార్ ప్రభుత్వ సహకారంతో ఏర్పాటు
- 105 నియోజకవర్గాల్లో మల్టీ స్పెషాలిటీలు
- పీపీపీ విధానంలో ఏర్పాటు చేస్తాం
- ఆరోగ్యశ్రీ కేసుల్లో 50 శాతం వాటికే
- ఆరోగ్య వివరాలతో హెల్త్ డిజీ లాకర్
- 26 నెలల్లో వర్చువల్ ఆస్పత్రులు
- జూన్ 15న కుప్పంలో పైలట్ ప్రాజెక్టు: చంద్రబాబు

అమరావతి, రాష్ట్రాన్ని ఆరోగ్యాంధ్రగా తీర్చిదిద్దాలన్నదే తన లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాల వారీగా హెల్త్ రిపోర్టులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. రాష్ట్ర బడ్జెట్‌లో వైద్య రంగానికి రూ.19,264 కోట్లు ఖర్చు చేస్తున్నామని.. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఏపీ సాధనకు ప్రయత్నిస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో 80 శాతం మంది ప్రధానంగా 10 రకాల వ్యాధులతో బాధపడుతున్నారని తెలిపారు. "కేంద్రం దేశంలో 25 మెడిసిటీలను పెట్టాలనే యోచనలో ఉంది. ఖతార్

- మిగతా 2వ పేజీలో

## హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు

# డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

వీసీ హామీ ఇస్తే వర్సిటీ నుంచి పోలీసు బలగాలు వెనక్కి: మంత్రుల కమిటీ

ఆ 400 ఎకరాల్లో బందోబస్తు యథాతథం



- అధ్యాపకులు, విద్యార్థులను అక్కడ 'సర్వే'కు అనుమతించేది లేదు
- మంత్రుల కమిటీతో యూహెచ్‌టీఏ, పౌరసమాజ ప్రతినిధులు సమావేశం

హైదరాబాద్: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులపై నమోదు చేసిన కేసులను ఉపసంహరించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పోలీసు అధికారులను ఆదేశించారు. జ్యుడీషియల్ రిమాండ్‌లో ఉన్న ఇద్దరు విద్యార్థులకు సంబంధించి కేసుల ఉపసంహరణకు వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ క్రమంలో న్యాయపరమైన సమస్యలు ఉత్పన్నం కాకుండా

- మిగతా 2వ పేజీలో



# తుది దశలో ఆ మెట్రో డీపీఆర్‌లు

- నిర్మాణ వ్యయంపై త్వరలో అంచనాలు
- రెండో దశ 'బి'కేటగిరీలో మూడు కారిడార్లు
- కేంద్రం అనుమతి కోసం ఎదురుచూపులు
- డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌లపై ప్రతిష్టంభన

హైదరాబాద్: మెట్రో రెండో దశ 'బి'విభాగం కింద ప్రతిపాదించిన నార్త్ సిటీ, ఫోర్త్ సిటీ మెట్రో ప్రాజెక్టుల సమగ్ర ప్రాజెక్ట్ నివేదికలు (డీపీఆర్‌లు) తుది దశకు చేరుకున్నాయి. ప్రస్తుతం మూడు కారిడార్‌ల అలైన్‌మెంట్‌లు, నిర్మాణ వ్యయంపై అంచనాలను సిద్ధం చేస్తున్నారు. మరో వారం, పది రోజుల్లో హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రో రైల్ (హెచ్‌ఏఎంఆర్‌ఎల్) సంస్థ తుది మెరుగులు దిద్ది ప్రభుత్వానికి

- మిగతా 2వ పేజీలో

# గ్యాస్ బండపై రూ. 50 వడ్డింపు



- సీఎన్‌జీపైనా రూపాయి పెంపు అర్ధరాత్రి నుంచే అమల్లోకి
- పెట్రోల్, డీజిల్‌పై రూ. 2 ఎక్సైజ్ సుంకం
- పెట్రోలియం సంస్థల నష్టాలతో ధరల పెంపు తప్పలేదన్న కేంద్రం
- పెట్రో భారం సామాన్యులపై ఉండదని స్పష్టీకరణ

న్యూఢిల్లీ: ఎల్పీజీ వినియోగదారులపై భారం మరింత పెరిగింది. గృహావసరాల ఎల్పీజీ సిలిండర్ ధరను 50 రూపాయలు పెంచుతూ కేంద్రం సోమవారం నిర్ణయం తీసుకుంది. ఇది సాధారణ వినియోగదారులతో పాటు నిరుపేద ఉజ్వల పథక లబ్దిదారులకు



# డోలీ మోతల రహిత మన్యమే లక్ష్యం..

- గిరిజన బిడ్డల మేలుకు కూటమి కట్టుబడింది
- మాకు ఓట్లు వేయకపోయినా ప్రగతి చర్యలు
- గిరిజన ప్రాంతాల్లో రోడ్లకు నిధులడిగితే
- 24 గంటల్లో 49 కోట్లు మంజూరుచేసిన సీఎం
- వైసీపీ హయాంలో ఏపీలో కేవలం 92 కి.మీ.రోడ్లు
- ఏడాదిలోనే 1,069 కి.మీ.రహదారులు నిర్మించాం
- అరకులోయను పర్యాటకపరంగా అభివృద్ధి చేస్తాం
- ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వెల్లడి

# చైనాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం

34 శాతం ప్రతీకార సుంకాలపై ధ్వజం

తక్షణం రద్దు చేయండి లేదంటే రేపట్నుంచే అమలు

టారిఫ్‌లపై తగ్గేదే లేదన్న అధ్యక్షుడు

వాషింగ్టన్: చైనాపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి విరుచుకుపడ్డారు. అమెరికాపై 34 శాతం ప్రతీకార సుంకాలు విధించడంపై తీవ్రంగా మండిపడ్డారు. ఆ నిర్ణయాన్ని మంగళవారంలోగా వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే

2లో



# ప్రపంచ మార్కెట్లు కుదేల్




ముంబై, ఏప్రిల్ 7: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భీకర నష్టాలను చవిచూశాయి. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సృష్టించిన టారిఫ్ ప్రకంపనలు యావత్తు ప్రపంచ మార్కెట్లను కుదిపేస్తున్నాయి. ఈ ప్రభావం భారతీయ సూచీలపైనా పడింది. ఈ క్రమంలోనే బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 2,226.79 పాయింట్లు లేదా 2.95 శాతం నష్టపోయి 73,137.90 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ఆరంభంలోనైతే ఏకంగా 3,939.68 పాయింట్లు (5.22 శాతం) కోల్పోవడం గమనార్హం. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ కూడా 742.85 పాయింట్లు లేదా 3.24 శాతం పడిపోయి 22,161.60 వద్ద నిలిచింది. ఒకానొక దశలో 1,160.80 పాయింట్లు (5.06 శాతం) క్షీణించింది. దీంతో గత ఏడాది జూన్ 4 (10 నెలలు) తర్వాత ఈ స్థాయిలో సూచీలు కుదేలవడం ఇదే తొలిసారైంది. ఉదయం ఆరంభం నుంచే భారీ నష్టాల్లో కదలాడిన సూచీలు.. ఏ దశలోనూ లాభాల్లోకి రాలేకపోయాయి. అయితే సమయం గడుస్తున్నకొద్దీ నష్టాల తీవ్రత మాత్రం తగ్గింది. కాగా, ఈ నెల 2న ఆయా దేశాలపై ప్రతీకార సుంకాలను ట్రంప్ ప్రకటించిన సంగతి విదితమే. అయితే దీనికి బదులిస్తూ చైనా కూడా దీటుగా స్పందించింది. దీంతో ఆర్థిక మందగమనం భయాలు ఒక్కసారిగా గ్లోబల్ మార్కెట్‌ను హీటెక్కించాయి. ఇదే సమయంలో ఇన్వెస్టర్లను ట్రేడ్‌వార్ భయాలూ చుట్టుముట్టాయి. అలా చెలరేగిన అమ్మకాల ఒత్తిడే మండే మార్కెట్లను ముంచేసింది. టారిఫ్‌ల దెబ్బకు దేశీయ స్టాక్ మార్కెట్లు అతలాకుతలం అవుతున్నాయి. 775 షేర్లు అయితే ఏడాది కనిష్ఠానికి జారుకున్నాయి. వీటిలో దేశీయ అగ్రగామి సంస్థయైన రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా ఉన్నది. ఇంట్రాడేలో ఏడాది కనిష్ఠ స్థాయి రూ.1,115.55కి పడిపోయిన ఆర్ఐఎల్ షేరు చివరకు 4.13 శాతం నష్టంతో రూ.1,155 వద్ద ముగిసింది. అలాగే టీసీఎస్ 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.3,060.25కి జారుకోగా, ఇన్ఫోసిస్ షేరుకూడా రూ.1,307.10కి పడిపోయింది. వీటితోపాటు లార్సెన్ అండ్ టుబ్రో, టాటా గ్రూపునకు చెందిన టైటాన్, టాటా మోటర్స్ షేర్లు భారీగా నష్టపోవడంతో వీటి మార్కెట్ విలువ రూ.41.81 లక్షల కోట్లు ఆవిరైంది. అయినప్పటికీ 59 కంపెనీల షేర్లు 52 వారాల గరిష్ఠ స్థాయికి చేరుకోవడం విశేషం.

స్టాక్ మార్కెట్లు భారీగా పతనం కావడానికి మోదీ ప్రభుత్వమే కారణమని కాంగ్రెస్ విమర్శించింది. మార్కెట్లు నష్టపోవటం చూసి తనకు ఎలాంటి ఆశ్చర్యం కలగలేదని కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేశ్ అన్నారు. ఆర్థిక వ్యవస్థల పతనం.. స్వయంగా చేసుకున్న గాయాలుగా ఆయన అభివర్ణించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని మోదీ చర్యల కారణంగా మార్కెట్లు తీవ్రంగా నష్టాలు చవిచూస్తున్నాయని ఆరోపించారు. టారిఫ్‌లకు తగ్గట్టుగానే మార్కెట్లు స్పందిస్తున్నాయని అన్నారు. 'ప్రధాని మోదీ, డొనాల్డ్ ట్రంప్ మంచి స్నేహితులుగా అభివర్ణించటంలో ఆశ్చర్యం లేదు. ఎందుకంటే.. ఇద్దరూ తమ ఆర్థిక వ్యవస్థలు పతనం కావడానికి స్వయంగా సమస్యలు సృష్టించుకోవటంలో నిపుణులు. వ్యాధి నయం కావాలంటే మందు చేదుగా ఉన్నప్పటికీ, తీసుకోవలిసిందేనని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. ఆయన ఇటీవల వివిధ దేశాల దిగుమతులపై సుంకాలను విధించడంతో అమెరికా సహా ప్రపంచ దేశాల మార్కెట్లు కుదేలవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. వాణిజ్యలోటు గాడిలో పడే వరకు సుంకాలను తగ్గించే ప్రసక్తే లేదని ఆయన స్పష్టం చేశారు. ప్రపంచ మార్కెట్ల పతనాన్ని తాను కోరుకోలేదని, భారీ అమ్మకాల గురించి ఆందోళనకు గురికావడం లేదని చెప్పారు. తాను ఐరోపా, ఆసియా దేశాల అధినేతలతో చర్చించానని, ఇప్పుడు వారంతా అమెరికాతో ఒప్పందాల కోసం ఆత్రుతపడుతున్నారని తెలిపారు. మెటల్ షేర్లను మదుపరులు గట్టిగానే దూరం పెట్టారు. దీంతో బీఎస్ఈలో మెటల్ సూచీ గరిష్ఠంగా 6.22 శాతం నష్టపోయింది. నేషనల్ అల్యూమినియం కంపెనీ లిమిటెడ్ షేర్ విలువ అత్యధికంగా 8.18 శాతం పడిపోగా, ఆ తర్వాత టాటా స్టీల్ 7.73 శాతం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ 7.58 శాతం, సెయిల్ 7.06 శాతం, జిందాల్ స్టీల్ అండ్ పవర్ లిమిటెడ్ 6.90 శాతం చొప్పున క్షీణించాయి.

# 200 ఎకరాల్లో మెగా మెడిసిటీ

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వ సహకారంతో అమరావతిలో ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం (పీపీపీ)తో మెగా గ్లోబల్ మెడిసిటీ ఏర్పాటుపై కేంద్రాన్ని సంప్రదించగా సుముఖత వ్యక్తం చేసింది. ఈ మెడిసిటీ కోసం 200 ఎకరాలు కేటాయించి.. అందులో 100 ఎకరాలు హెల్త్‌కేర్ సేవలకు, 40 ఎకరాలు నివాసాలకు, 20 ఎకరాలు వాణిజ్య అవసరాలకు, 20 ఎకరాలు సర్వీస్ జోన్‌కు వినియోగించుకునేలా విధానాలు రూపొందించాం. హెల్త్ టూరిజానికీ ఇది ఉపయోగపడుతుంది" అని చంద్రబాబు పేర్కొన్నారు. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 100 నుంచి 300 పడకల మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు నిర్మిస్తామన్నారు. ప్రస్తుతం 175 నియోజకవర్గాలకు 70 చోట్లే మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రులు ఉన్నాయన్నారు. మిగతా 105 నియోజకవర్గాల్లో పీపీపీ విధానంలో నిర్మిస్తామని, అవసరమైతే వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (వీజీఎఫ్) అందిస్తామని చెప్పారు. ఆరోగ్యశ్రీ కేసుల్లో 50 శాతం వీటికే రిఫర్ చేసి నిలబడేలా చూస్తామని, వీటి నిర్మాణానికి ఉచితంగా స్థలం కేటాయిస్తామని వివరించారు. "ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్ల జారీలో ఏపీ ముందంజలో ఉంది. రాష్ట్ర జనాభాలో 88% మందికి హెల్త్ అకౌంట్లు రూపొందించాం. వర్చువల్ ఆస్పత్రులను రాష్ట్రవ్యాప్తంగా తీసుకురావాలన్న లక్ష్యంతో కుప్పం నియోజకవర్గంలోని 5 మండలాల్లో పైలట్ ప్రాజెక్టుగా డిజిటల్ నెర్వ్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నాం" అని చంద్రబాబు తెలిపారు. జూన్ 15న దీనిని ప్రారంభిస్తామన్నారు. "26 నెలల్లో ఈ వర్చువల్ ఆస్పత్రులను పూర్తి చేస్తాం. ప్రతి ఒక్కరి హెల్త్ రికార్డులను డిజిటల్ లాకర్‌లో పెడతాం. మొబైల్ వైద్య వాహనాల ద్వారా ఇంటి వద్దే పరీక్షలు చేయిస్తాం. డాక్టర్లు ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ ద్వారా సేవలందిస్తారు" అని వివరించారు. "ఆరోగ్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చేందుకు టాటా, గేట్స్ ఫౌండేషన్ సహకారంతో ముందుకెళ్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్ట్ తరఫున న్యూట్రిఫుల్ యాప్‌ను డెవలప్ చేశారు. ప్రస్తుతం 4 లక్షల మంది దీనిని అనుసరిస్తున్నారు" అన్నారు.ఁపాఠశాల విద్య నుంచే ఆహారపు అలవాట్లు.. ఆరోగ్యం అంశాన్ని కూడా ఒక సబ్జెక్టుగా పెట్టాలన్న ఆలోచన ఉందని చంద్రబాబు చెప్పారు. ప్రతి రోజూ వ్యాయామం, యోగా, ధ్యానం, ప్రాణాయామం చేస్తే మెరుగైన ఫలితాలు సాధించవచ్చన్నారు. 'నలుగురు ఉన్న కుటుంబంలో వంటనూనె నెలకు 2 లీటర్లు, చక్కెర 3 కేజీల కన్నా ఎక్కువ వినియోగించకుండా చూసుకోవాలి. ఉప్పు వినియోగం తగ్గిస్తే 40 శాతం మేర గుండెపోట్లు తగ్గుతాయి' అని తెలిపారు. రోజూ అరగంట నడవడం, దైవ చింతనలో గడపడం ద్వారా ఒత్తిడి తగ్గుతుందన్నారు. పొగాకు, డ్రగ్స్, అల్కహాల్‌ను దూరం పెడితే కేన్సర్, లివర్, కిడ్నీ సమస్యలు తగ్గుతాయని చెప్పారు. జంక్ ఫుడ్, పాలిష్డ్ బియ్యం తినడం తగ్గించి మిల్లెట్స్, ముడి బియ్యం, కూరగాయలు ఎక్కువగా తినాలని సూచించారు. గత మూడు నెలల్లో ప్రభుత్వాసుపత్రుల పట్ల పలు అంశాల్లో ప్రజల్లో సానుకూలత మరింత పెరిగింది. అయితే పరిశుభ్రతపై పెదవి విరుస్తున్నారు.



# చైనాకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అల్టిమేటం

(మొదటి పేజీ తరువాయి)

బుధవారం నుంచి చైనాపై ఏకంగా మరో 50 శాతం అదనపు సుంకాలు విధిస్తానని సోమవారం హెచ్చరించారు. అంతేకాదు, "చైనా విజ్ఞప్తి మేరకు పలు అంశాలపై ఆ దేశంతో పురోగతిలో ఉన్న అన్నిరకాల చర్చలనూ ఉన్నపళాన నిలిపేస్తాం. బదులుగా ఇతర దేశాలపై దృష్టి సారిస్తాం. ఆయా రంగాల్లో వాటితో బంధాలను పటిష్టం చేసుకుంటాం" అని కుండబద్దలు కొట్టారు. చైనాపై ట్రంప్ ఇటీవలే 34 శాతం సుంకాలు విధించడం, బదులుగా అమెరికాపైనా అంతే శాతం సుంకాలు విధిస్తున్నట్టు చైనా ప్రకటించడం తెలిసిందే. అంతేగాక తమనుంచి అమెరికా దిగుమతి చేసుకుంటున్న పలు కీలక ఖనిజాలపై ఆంక్షలు కూడా విధించింది. దీనిపై ట్రంప్ తీవ్రంగా మండిపడుతూ తన సోషల్ మీడియా హాండిల్ ట్రూత్‌లో పలు పోస్టులు పెట్టారు. "అమెరికా ఉత్పత్తులపై చైనా ఏళ్లుగా రికార్డు స్థాయిలో భారీ టారిఫ్‌లు వసూలు చేస్తోంది. అవి చాలవన్నట్టు నిన్న మరో 34 శాతం ప్రతీకార సుంకాలు విధించింది. ఇవిగాక చైనా కంపెనీలు అనైతిక సబ్సిడీలు, భారీ ద్రవ్య అవకతవకల వంటివాటికి పాల్పడుతూ వస్తున్నాయి! నేను విధించిన సుంకాలపై ఏ దేశమైనా ప్రతీకార చర్యలకు దిగితే సహించబోమని స్పష్టంగా హెచ్చరించా. వాటిపై అదనపు బాదుడు తప్పదని అప్పుడే స్పష్టం చేశా. చైనా ఇప్పుడు వాటిని రుచిచూడబోతోంది" అని ప్రకటించారు. తన సుంకాల దెబ్బకు ప్రపంచ మార్కెట్లన్నీ పతనమవుతున్నా ట్రంప్ మాత్రం డోంట్ కేర్ అంటున్నారు. అమెరికా ద్రవ్యోల్బణం కోరల్లో చిక్కుతోందని ఆర్థిక నిపుణులంతా గగ్గోలు పెడుతున్నా అదేమీ లేదని చెప్పుకొచ్చారు. ఎవరేమన్నా సుంకాలపై తగ్గే ప్రసక్తే లేదని ఆయన కుండబద్దలు కొట్టారు. ప్రపంచం ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక సమస్యలంటికీ అమెరికా గత పాలకులు, తమను ఇంతకాలంగా దోచేసిన చైనా వంటి దేశాలే కారణమని నిందించారు. "ఒక్కోసారి చేదుగా ఉన్నా చికిత్స తప్పదు. నా చర్యల ఫలితాలు ఇప్పటికే కన్పిస్తున్నాయి. చమురు ధరలు దిగొచ్చాయి. వడ్డీ రేట్లూ తగ్గుముఖం పడుతున్నాయి. ఆహార పదార్థాల ధరలూ తగ్గుతున్నాయి. ఇక ద్రవ్యోల్బణం ఎక్కడున్నట్టు? పలు దేశాలు అమెరికాను ఇంతకాలం పీల్చి పిప్పి చేశాయి. ముఖ్యంగా చైనా! ఇప్పుడు చూడండి, నా టారిఫ్‌ల దెబ్బకు చైనా మార్కెట్లు కుప్పకూలుతున్నాయి. ఇకపై అమెరికాకు ప్రతి వారం ఏకంగా బిలియన్ల కొద్దీ డాలర్లు వచ్చిపడతాయి. చూసుకోండి" అంటూ స్పష్టం చేశారు.

# హెచ్‌సీయూ విద్యార్థులపై కేసుల ఉపసంహరణకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

(మొదటి పేజీ తరువాయి)

పోలీస్ అధికారులకు తగు సూచనలు చేయవలసిందిగా న్యాయశాఖ అధికారులను ఆదేశించారు. కంచ గచ్చిబౌలి భూముల వివాదానికి సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన మంత్రుల సబ్ కమిటీ సోమవారం సచివాలయంలో డిప్యూటీ సీఎం అధ్యక్షతన సమావేశమైంది. కమిటీ సభ్యులైన మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్ రెడ్డి, ఇంటెలిజెన్స్ డైరెక్టర్ జనరల్ శివధర్‌రెడ్డి, సైబరాబాద్ పోలీసు కమిషనర్ అభిషేక్ మహంతి ఈ సమావేశంలో పాల్గొన్నారు. హైదరాబాద్ విశ్వవిద్యాలయ ఉపాధ్యాయ సంఘం (యూహెచ్‌టీఏ), పౌర సమాజ ప్రతినిధులు కూడా వారితో సమావేశమై పలు డిమాండ్లు ప్రస్తావించారు. ఈ సమావేశం అనంతరం డిప్యూటీ కీలక ఆదేశాలు జారీ చేశారు. పౌర సమాజ ప్రతినిధులు, యూహెచ్‌టీఏ ప్రస్తావించిన పలు అంశాలు, డిమాండ్లపై మంత్రుల ఉప కమిటీ కీలక ప్రకటన చేసింది. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇతర ప్రాంతాల నుంచి పోలీసు బలగాల ఉప సంహరణ కోసం హెచ్‌సీయూ వీసీకి లేఖ రాస్తామని హామీ ఇచ్చింది. విద్యార్థులు, హాస్టళ్ల భద్రతకు సంబంధించి వీసీ హామీ ఇస్తే బలగాలను ఉపసంహరిస్తామని పేర్కొంది. అయితే వివాదానికి కేంద్ర బింధువుగా ఉన్న 400 ఎకరాల్లో మాత్రం పోలీసు బందోబస్తు కొనసాగుతుందని మంత్రులు స్పష్టం చేశారు. ఇటీవల సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం 400 ఎకరాల భూమిని రక్షించేందుకు పోలీసు పహారా తప్పనిసరి అని పేర్కొన్నారు. అధ్యాపకులు, విద్యార్థులు సహా ఎవరినీ 400 ఎకరాల్లో సర్వేకు అనుమతించలేమని తెలిపారు. విద్యార్థులు కోరిన విధంగా యూనివర్సిటీని సందర్శించడానికి మంత్రుల కమిటీ సానుకూలంగా ఉందని, అయితే సుప్రీంకోర్టులో కేసు కొనసాగుతున్న నేపథ్యంలో న్యాయపరమైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఇప్పటికిప్పుడు యూనివర్సిటీకి రాలేమని చెప్పారు. అయితే విద్యార్థులపై కేసులను సాధ్యమైనంత త్వరగా ఉపసంహరించుకునేలా పోలీసు, న్యాయ శాఖతో సంప్రదించి అవసరమైన చర్యలు తీసుకుంటామని మంత్రులు హామీ ఇచ్చారు. మంత్రుల సబ్ కమిటీని కలిసిన యూనివర్సిటీ అధ్యాపక, పౌర సమాజ ప్రతినిధులు పలు డిమాండ్లను ప్రభుత్వం ముందు పెట్టారు. హెచ్‌సీయూ నుంచి పోలీసు బలగాలను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిషేధాజ్ఞలను వెనక్కి తీసుకోవాలని కోరారు. ఆందోళనలో పాల్గొన్న విద్యార్థులపై ఇటీవల నమోదు చేసిన అన్ని కేసులను ఉపసంహరించుకోవడంతో పాటు పోలీసు కస్టడీలో ఉన్న ఇద్దరు విద్యార్థులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర సాధికార కమిటీ క్యాంపస్‌ను సందర్శించే ముందు 400 ఎకరాల కంచ గచ్చిబౌలి భూమిలో నష్టాన్ని అంచనా వేయడంతో పాటు జీవవైవిధ్య సర్వే నిర్వహించడానికి నిపుణులైన అధ్యాపకులు, పరిశోధకులకు అనుమతి ఇవ్వాలని కోరారు. తమ డిమాండ్లను ప్రభుత్వం పట్టించుకోక పోవడం వల్లే విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ ఈ సమావేశానికి హాజరు కాలేదని మంత్రుల దృష్టికి తీసుకువచ్చారు. పైన పేర్కొన్న తక్షణ డిమాండ్లు నెరవేర్చిన తర్వాతే విద్యార్థి జాయింట్ యాక్షన్ కమిటీ నాయకులు మంత్రుల కమిటీ నిర్వహించే సమావేశానికి హాజరవుతారని సమాజ ప్రతినిధులు స్పష్టం చేశారు.

# తుది దశలో ఆ మెట్రో డీపీఆర్‌లు

(మొదటి పేజీ తరువాయి)

నివేదికలు అందజేయనుంది. మొదట్లో భావించినట్లుగా డబుల్‌డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌లకు అవకాశం ఉండకపోవచ్చన్నారు. జేబీఎస్ నుంచి మేడ్చల్ మార్గంలో డెయిరీ ఫాం వరకు హెచ్ఎండీఏ చేపట్టిన ఎలివేటెడ్ కారిడార్ మార్గంలో బేగంపేట్ ఎయిర్‌పోర్టు వద్ద 600 మీటర్ల సొరంగ మార్గాన్ని నిర్మించనున్నారు. దీంతో డబుల్ డెక్కర్‌పై ప్రతిష్టంభన నెలకొంది. మెట్రో కోసం ప్రత్యేకంగా ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. అలాగే ప్యారడైజ్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు ప్రతిపాదించిన రూట్‌లో కూడా డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ సాధ్యాసాధ్యాలపై సాంకేతిక, ఇంజనీరింగ్ నిపుణులు త్వరలో ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. రూట్‌లో కూడా హెచ్ఎండీఏ ఎలివేటెడ్ కారిడార్‌ను ప్రతిపాదించింది. ప్రస్తుతం కంటోన్మెంట్ ఏరియాలో రక్షణశాఖ నుంచి భూముల సేకరణపై ప్రతిష్టంభన నెలకొంది. రక్షణ శాఖ అధికారులతో హెచ్ఎండీఏ అధికారులు తాజాగా సమావేశమయ్యారు. మరోవైపు ఫోర్త్ సిటీకి ప్రతిపాదించిన ఎలివేటెడ్ కారిడార్‌లో కొన్ని కిలోమీటర్లు భూమార్గంలో మెట్రో పరుగులు తీయనుంది. ఆరు వరుసల గ్రీన్‌ఫీల్డ్ రహదారి మధ్యలో మెట్రో రైలు మార్గాన్ని నిర్మించాలనే ప్రతిపాదన ఉంది. జేబీఎస్ నుంచి మేడ్చల్ వరకు 24 కి.మీ, జేబీఎస్ నుంచి శామీర్ పేట్ వరకు 21 కి.మీ, ఫ్యూచర్‌సిటీ వరకు 41 కి.మీ. మెట్రో కారిడార్‌ల డీపీఆర్‌ల కోసం హెచ్ఏఎంఆర్ఎల్ దశలవారీగా క్షేత్రస్థాయిలో సర్వేలు నిర్వహించింది. ఈ కారిడార్‌లలో ప్రస్తుతం ఉన్న ట్రాఫిక్‌తోపాటు భవిష్యత్తులో పెరగనున్న వాహనాల రద్దీపై ఇప్పటికే నివేదికలను రూపొందించారు. అలాగే జియో టెక్నికల్ ఇన్వెస్టిగేషన్, పర్యావరణ ప్రభావంపై సమగ్ర అధ్యయనం చేసి నివేదికలను సిద్ధం చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. మెట్రో రాక వల్ల నార్త్‌సిటీ వైపు వాహనకాలుష్యం భారీగా తగ్గుముఖం పట్టనుందని అంచనా. భూసామర్థ్య పరీక్షల్లో భాగంగా మేడ్చల్ మార్గంలో 14 చోట్ల, శామీర్ పేట్ మార్గంలో 11 చోట్ల పరీక్షలు పూర్తిచేశారు. మెట్రో రెండో దశలో ఇప్పటికే 5 కారిడార్‌లలో 76.4 కి.మీ.తోపాటు ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు 23 కి.మీ., శామీర్‌పేట్ ఓఆర్ఆర్ వరకు 22 కి.మీ, ఫ్యూచర్‌సిటీ కారిడార్ 41 కి.మీ. చొప్పున మొత్తం 8 కారిడార్‌లలో 162.4 కి.మీ. వరకు మెట్రో కారిడార్‌లు విస్తరించనున్నారు.

# గ్యాస్ బండపై రూ. 50 వడ్డింపు

(మొదటి పేజీ తరువాయి)

కూడా వర్తిస్తుందని కేంద్ర చమురు శాఖ మంత్రి హర్దీప్‌సింగ్ పురి వెల్లడించారు. సోమవారం అర్ధరాత్రి నుంచే పెంపు అమల్లోకి వచ్చింది. ఎల్పీజీ విక్రయాలపై పెట్రోలియం సంస్థలు నష్టాలు మూటగట్టుకుంటున్నందున ఈ నిర్ణయం తప్పలేదన్నారు. తాజా పెంపుతో దేశ రాజధానిలో ఎల్పీజీ సిలిండర్ ధర ఉజ్వల వినియోగదారులకు రూ.503 నుంచి రూ.553కు పెరిగింది. సాధారణ వినియోగదారులకు ధర రూ.853కి చేరింది. సీఎన్‌జీ ధరలను కూడా దాదాపు నాలుగు శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఫలితంగా ఢిల్లీలో సీఎన్‌జీ ధర కిలోకు ఒక రూపాయి పెరిగి రూ.75.09కి చేరింది. వీటితో పాటు పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని కూడా కేంద్రం 2 రూపాయల చొప్పున పెంచింది. అయితే ఈ పెంపు రిటైల్ ధరలకు వర్తించబోదు. ఫలితంగా ఈ భారం సామాన్య వినియోగదారులపై పడబోదని పురి స్పష్టం చేశారు. "అంతర్జాతీయంగా చమురు ధరలు బ్యారల్‌కు 70%-%75 డాలర్ల నుంచి 60 డాలర్లకు తగ్గిన నేపథ్యంలో పెట్రోల్, డీజిల్‌పై ప్రత్యేక అదనపు ఎక్సైజ్ సుంకం విధించాలని నిర్ణయించాం.

# పట్టాభిషిక్తుడైన భద్రాద్రి రామయ్య

భద్రాద్రి కొత్తగూడెం: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానంలో జగదభిరాముడికి సోమవారం పట్టాభిషేక మహోత్సవం వైభవోపేతంగా జరిగింది. సీతారాముల కల్యాణం మరుసటి రోజున పుష్యమి నక్షత్రం సందర్భంగా మిథిలా స్టేడియంలో రామయ్యకు పట్టాభిషేకం నిర్వహించడం ఆనవాయితీ. ఉదయం 10 గంటలకు శంఖ, చక్ర, ధనుర్బాణాలు ధరించిన సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్యను పల్లకీ సేవగా బయటికి తెచ్చారు. మేళతాళాలు, కోలాటం, భజంత్రీలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ సింహాసనంపై కొలువుదీర్చారు. వైదిక మంత్రాలతో వశిష్టుడు, వామనుడు, జాబాలి, కశ్యపుడు, కాత్యాయనుడు, గౌతముడు, విజయుడు, సుయజ్ఞుడును వేద పండితులు వరింప జేసుకున్నారు. పట్టాభిషేకం జరిగే ప్రధాన మండపానికి ముందు మూడు ఉప మండపాల్లో మూడు కలశాలను ఏర్పాటు చేశారు. ఒక మండపంలో సముద్ర, నదీ జలాలను ఆవాహన చేశారు. మరో కలశంలో బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులతోపాటు రామ పరివారాన్ని ఆవాహన చేశారు. మరో కలశంలో అష్టదిక్పాలకులను, పట్టాభిషేకానికి ఉపయోగించే వస్తువులతోపాటు ఆది దేవతలను ఆవాహన చేస్తూ చతుర్వేద హవన పురస్కృతంగా మండపత్రయ ఆరాధన నిర్వహించారు. అనంతరం అష్టోత్తర శతనామార్చన చేశారు. మధ్యాహ్నం 12 గంటలకు అభిజిత్ లగ్న సుముహూర్తాన బంగారు సింహాసనంపై స్వర్ణఛత్ర, స్వర్ణపాదుక, రాజదండ, రాజపట్ట, రాజముద్ర, వజ్ర కిరీటాలను స్వామివారికి ప్రదానం చేశారు. లక్ష్మీదేవిని ఆవాహన చేసిన రాజముద్రికను కుడి చేతి వేలికి తొడిగారు.

3
సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
మంగళవారం 8-4-2025





# డెహ్రాడూన్ లో చింతన్ శివిర్ సదస్సులో పాల్గొన్న మంత్రి డోలా

కనిగిరి అస్త్రం ప్రతినిధి: ఎస్సీల విద్య, ఆర్థిక, సామాజిక సాధికారికత అంశాలపై ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని డెహ్రాడూన్ లో జరిగిన చింతన్ శివిర్ సదస్సుకి రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి హాజరయ్యారు. కేంద్ర సామాజిక న్యాయం సాధికారత శాఖ మంత్రి వీరేంద్ర కుమార్ అధ్యక్షతన డెహ్రాడూన్ లో (ఈ నెల 7, 8) రెండు రోజుల పాటు చింతన్ శివిర్ సమావేశం నిర్వహించారు. ఈ సదస్సుకు అన్ని రాష్ట్రాల సాంఘిక సంక్షేమ శాఖ మంత్రులు హాజరయ్యారు. మొదటి రోజు ఈ సమావేశంలోదివ్యాంగుల సంక్షేమం, ఎస్సీ విద్యార్థులకు పోస్టుమెట్రిక్, ప్రీ మెట్రిక్ స్కాలర్షిప్పులు, ఎస్సి హాస్టళ్ల నిర్మాణం, మరమ్మతులు, ప్రధానమంత్రి యంగ్ ఎచీవర్స్ స్కాలర్షిప్ అవార్డ్స్ వైబ్రంట్ ఇన్ ఇండియా , పీఎం అజయ్ , అటల్ వయో అభ్యుదయ యోజన, ప్రధానమంత్రి ఆదర్శ్ గ్రామ యోజన,అంశాలపై ప్రజెంటేషన్ చర్చ జరిగింది. వీటితో పాటు రాష్ట్రాల్లో ఎస్సీ, ఎస్టీ రక్షణ చట్టం అమలు, హిజ్రాల సంక్షేమంపై ప్రజెంటేషన్ చర్చించారు.



# తహసిల్దార్ కార్యాలయానికి నల్లూరి ఫౌండేషన్ కంప్యూటర్లు బహుకరణ

**చీమకుర్తి అస్త్రం ప్రతినిధి :** నల్లూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నల్లూరి శేషయ్య చీమకుర్తి తాహసీల్దరు కార్యాలయమునకు వెళ్లి తాహసిల్దారు బ్రహ్మయ్యకు నాలుగు కంప్యూటర్లు బహుకరించారు ఈ సందర్భంగా నల్లూరి శేషయ్య మాట్లాడుతూ రైతు కుటుంబం నుంచి వచ్చిన నాకు రైతులు పడుతున్న ఇబ్బందులు తెలుసునని అందుకు రైతులు తహసిల్దార్ ఆఫీస్ కు సర్టిఫికెట్ ఇతర పనులు కోసం వచ్చినప్పుడు ఆలస్యం అవ్వకుండా ఎటువంటి ఇబ్బందులు పడకుండా అలాగే విద్యార్థులు క్యాస్ట్ సర్టిఫికేట్ మరియు నెగెటివిటీ లాంటి ఇతర పనుల కోసం వచ్చినప్పుడు ఆలస్యం అవ్వకుండా త్వరగా పని ముగించుకొని వెళ్లడం కోసం మరియు అలాగే ఆఫీస్ సిబ్బంది సులభంగా పనిచేయుటకు వీలుగా తాహసిల్దార్ బ్రహ్మయ్య అడిగిన వెంటనే నాలుగు కంప్యూటర్లు బహుకరించడం జరిగినందుకు సంతోషంగా ఉంది. ఇక్కడే పుట్టి ఇక్కడే చదువుకొని ఇక్కడే పెరిగిన మేము వేరే దేశాల్లో వ్యాపారం చేసేంత స్థాయి కి ఎదిగాము అందుకు ఇక్కడ ఇలాంటి మంచి కార్యక్రమాలు ఇంకా చేస్తామని చెప్పారు ఈ కార్యక్రమంలో స్థానికులు మరియు టిడిపి నాయకులు మన్నెం ప్రసాద్, కొట్టిపాటి రాఘవరావు, గొల్లపూడి సుబ్బారావు, రవిపాటి రాంబాబు, కాట్రగడ్డ రమణయ్య, కందిమల్ల గంగాధర్, గాలి వెంకటసుబ్బయ్య, యోగయ్య, బొడ్డు రామారావు, వై నారాయణ, అవనిగడ్డ శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన శ్రీ పిఎస్ బాబు

## ఘనంగా సన్మానించిన పామూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘము సభ్యులు

చంద్రశేఖరపురం,అస్త్రం ఏప్రిల్ 7: ప్రకాశం జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులుగా నూతనంగా నియమితులైన శ్రీ పిఎస్ బాబు ( పులివర్తి సాయిబాబా) జిల్లా పర్యటనలో భాగంగా ఈరోజు పామూరు మండలానికి విచ్చేసిన సందర్భంగా పామూరు పట్టణంలోని జగద్గురు శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వాముల వారి దేవస్థానంలో పామూరు మండల విశ్వ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు నొస్స%శీ% నాగేంద్ర చారి అధ్యక్షతన పామూరు మండల విశ్వబ్రాహ్మణ సోదరులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మండల విశ్వబ్రాహ్మణ సంఘీయులు వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి అలాగే మండల విశ్వబ్రాహ్మణ సంఘం కమిటీ గురించి అధ్యయనం చేయడం జరిగింది. అనంతరం పామూరు విశ్వబ్రాహ్మణ సంఘీయుల సమావేశానికి విచ్చేసిన జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పిఎస్ బాబు ను పామూరు మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు శాలువా కప్పి ఘనంగా సన్మానించడం జరిగింది. ఈ సమావేశంలో జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు పిఎస్ బాబు మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘం లో ఉండే ప్రతి



ఒక్క సభ్యులు కలిసిమెలిసి ఉండి వారి సమస్యలను జిల్లా దృష్టికి తీసుకువస్తే మేము వాటిని పరిష్కరిస్తామని అలాగే మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు వారికి సూచనలు తెలియజేశారు పిఎస్ బాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ ఉద్యోగ సంఘం అధ్యక్షులు రావూరి లక్ష్మయ్య, కొండూరు విశ్వసేన్, ఒంగోలు నగర విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షులు కీనల శ్రీనివాసులు చారి, వీరబ్రహ్మేంద్రస్వామి దేవస్థానం గౌరవ అధ్యక్షులు వినుకొండ రామాచారి, ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ కమ్యూనిటీ రాష్ట్ర నాయకులు పెరమన విజయ్ కుమార్ చారి, మండల విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు పెనువర్తి ప్రసాద్ చారి, నెల్లూరు రఘు ఆచారి, శేఖర్ చారి, మల్లికార్జున చారి, పెరమన బాల బ్రహ్మాచారి, పోలిచర్ల బాల బ్రహ్మం చారి, వినుకొండ సురేష్ చారి, పెనువర్తి కృష్ణమాచారి, నొస్స%శీ% సుఖేష్ చారి, మంగంపేట ప్రసాద్ చారి మండల విశ్వబ్రాహ్మణ సోదర సోదరీమణులు తదితరులు పాల్గొన్నారు.

# కె ఎస్ ఎం ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మంచి నీటి సదుపాయం



**కనిగిరి అస్త్రం ప్రతినిధి :** బంగారు బాల్యం, “వాటర్ బెల్” కార్యక్రమంలో భాగంగా సోమవారంకె ఎస్ ఎం ఎడ్యుకేషన్ సొసైటీ,గుడ్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాశీపురం, కాశిరెడ్డి నగర్, దేవాంగ నగర్,టకారి పాలెం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు మంచినీటి సదుపాయం ఏర్పాటు చేశారు.”వాటర్ బెల్” కార్యక్రమం విజయవంతం చేయాలంటే, విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అందరూ నీరు త్రాగడం యొక్క అవసరాన్ని గుర్తించి, ప్రతి గంటకు ఒకసారి నీరు తాగే అలవాటును అలవరుచుకోవాలని కె ఎస్ ఎం ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్,కనిగిరి పురపాలక సంఘం చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్ అన్నారు.పాఠశాలలో విద్యార్థులకు తాగునీరు అందుబాటులో ఉంచాలానే ఉద్దేశం తోనే ప్రతి రోజు ఉచిత నీటి సరఫరా చేస్తున్నట్లు తెలిపారు.విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు “వాటర్ బెల్” కార్యక్రమం యొక్క లక్ష్యం మరియు దాని ప్రయోజనాలను గుడ్ హెల్ప్ ఫౌండేషన్ చైర్మన్ డాక్టర్ మంద్రు ప్రవీణ్ కుమార్ వివరించారు.తల్లిదండ్రులను కూడా ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని వాటర్ బాటిల్స్ తెచ్చుకోవడానికి ప్రోత్సహించాలని అన్నారు.మంచి నీరు ఏర్పాటు చేసిన స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులుఅభినందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె. పద్మావతి, ఉపాధ్యాయులు ఈ. శైలజ, వి. కల్పన, ఎస్. కె కరీమున్నిసా బేగం, ఇతర ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు బంగారు బాల్యం కమిటి సభ్యులు, గుడ్ హెల్ప్ ఫౌండేషన్ డైరెక్టర్ రమేష్ బాబు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





# ఘనంగా ప్రపంచ ఆరోగ్య దినోత్సవ

పొన్నలూరు అస్త్రం ప్రతినిధి: ప్రపంచ ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పొన్నలూరు మండల పరిధిలో అన్ని గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కృష్ణ చైతన్య , డాక్టర్ రవికిరణ్, డాక్టర్ మల్లికార్జున, డాక్టర్ ఉమీరా పాల్గొని గ్రామాల్లో ఉన్న ప్రతి ఒక్కరూ ఆరోగ్యవంతులుగా ఉండటానికి కావలసిన పద్ధతులను పాటించాలన్నారు. ప్రజలు చుట్ట బీడీ సిగరెట్ తాగే అలవాటున్న వారు నేటి నుండి పూర్తిగా మానుకోవాలని, కాని పరిస్థితులకు క్యాన్సర్కు గురి కావచ్చున్నారు.ఊపకాయం కారణంగా బీపీ షుగర్ కొలెస్ట్రాలు గుండె జబ్బులు వంటివి రాకుండా ఉండటానికి ఆహార నియమాలు మార్పాడించాలని హితవు పలికారు. బిపి షుగర్ గుండెదబ్బులు మూత్రపిండ వ్యాధులు మొదలైన దీర్ఘకాలిక వ్యాధులు ఉన్నవారు తప్పకుండా వ్యాయామం చేయాలి. మందులు వాడుకుంటూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.చెన్నిపాడు గ్రామములో విద్యార్థులు, వృద్ధుల కు ఆరోగ్య జాగ్రత్తలూ ,ఆహారపు అలవాట్లు ,పరిసరాలు పారిశుధ్యం ,ప్రాణాయామం,వ్యాయాయం,క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు,జీవన శైలి వంటింటి అంశల పట్ల అవగాహన , సందేహాలు గూర్చి చర్చించారు ,విద్యార్థుల తో కలిసి ర్యాలీ నిర్వహించారు.

# గంజాయి స్వాధీనం నలుగురి అరెస్ట్

## సీఐ హాజరత్తయ్యా

ప్రకాశం అస్త్రం ప్రతినిధి : అక్రమంగా గంజాయి తరలిస్తున్న నలుగురిని అదుపులోకి తీసుకొని గంజాయిని స్వాధీన పరుచుకున్నట్లు సర్కిల్ ఇన్స్పెక్టర్ హాజరత్తయ్య తెలిపారు. సోమవారం ఆయన విలేకరులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.ప్రకాశం జిల్లా టంగుటూరు టోల్ ప్లాజా సమీపంలోని సర్వీసు రోడ్డు దగ్గర అక్రమంగా గంజాయి తరలిస్తున్నట్లు అందిన సమాచారం మేరకు పోలీసులు తనిఖీలు చేసి నలుగురు యువకులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుండి 4 1/2 కిలోలు గంజాయిని స్వాదీన పరుచుకొని గంజాయి తరలిస్తున్ననలుగురి పై కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్ కు తరలిస్తునట్లు సింగరాయకొండ సీఐ తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత మాదక ద్రవ్యాలను దూరంగా ఉండాలని , చెడు వ్యసనాలకు బానిస కాకూడదని సూచించారు.





# శ్రీనారాయణస్వామి దేవస్థానం ఆదాయం రూ.1,07,953/-

**చంద్రశేఖరపురం,అస్త్రం ఏప్రిల్ 7:** చంద్రశేఖరపురం మండలం మిట్టపాలెం గ్రామం లో వెలిసియున్న పవిత్ర పుణ్యక్షేత్రం శ్రీ నారాయణ స్వామి దేవస్థానము నకు ఆదివారం భక్తులు నుండి వివిధ రూపాల ద్వారా రూ.1,07,953/- ఆదాయము వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి గిరిరాజు నరసింహ బాబు తెలిపారు టికెట్లు అమ్మకం ద్వారా ఆదాయము రూ.38,730/-, లడ్డు ప్రసాదం అమ్మకం ద్వారా ఆదాయము రూ.22,830/- , శాశ్వత అన్నదానం విరాళముల ద్వారా ఆదాయము రూ.35,876/- పంచామృత అభిషేకమునకు విరాళముల ద్వారా ఆదాయము 5,516/-ఇతర విరాళంలో ద్వారా ఆదాయము 5,001/- రూపాయలు వచ్చినట్లు తెలిపారు.

సామాన్యుడి ఆయుధం
# అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
ప్రకాశం - బాపట్ల
మంగళవారం 8-4-2025






# శీలంవారిపల్లి లో ఘనముగా సీతారామచంద్రస్వామి ఊరేగింపు

## కొట్టే నారాయణ బ్రదర్స్ ఆధ్వర్యంలో కోలాటం ప్రదర్శన

## గ్రామస్తులను విశేషంగా ఆకట్టుకున్న కోలాట ప్రదర్శన

చంద్రశేఖరపురం, అస్త్రం ఏప్రిల్ 7: చంద్రశేఖరపురం మండలం శీలంవారిపల్లి గ్రామంలో శ్రీరామనవమి పండుగ సందర్భంగా శ్రీసీతారామచంద్ర స్వామివారి ఊరేగింపును ఘనముగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉత్సవమూర్తులను గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. శీలంవారిపల్లి గ్రామమునకు చెందిన కొట్టే నారాయణ అండ్ బ్రదర్స్ ఆధ్వర్యంలో నెల్లూరు వారిచే కోలాట ప్రదర్శన నిర్వహించారు. గ్రామోత్సవములో నిర్వహించిన కోలాట ప్రదర్శన గ్రామస్తులను అలరించింది. స్వామివారు గ్రామవీధుల్లో ఊరేగిస్తూ భక్తులకు ఆకట్టుకుంది. డీజే తో పాటు డోలు సన్నాయి డప్పుల వాయిద్యాల సందడితో గ్రామోత్సవము భారీ భక్తజన సందోహం కోలహలం నడుమ గ్రామంలోని ప్రధాన రోడ్ల మీదుగా కొన సాగింది. గ్రామస్తులు పురవీధులలో వారు పోసి స్వామివారికి పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుండి భక్తులు గ్రామోత్సవంలో భారీగా పాల్గొన్నారు. గ్రామోత్సవ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కోలాట ప్రదర్శన కళాకారులను అభినందించారు



# శ్రీ రామ శోభాయాత్రలో పాల్గొన్న పాములపాటి మాధవ్ ప్రసాద్

చంద్రశేఖరపురం, అస్త్రం ఏప్రిల్ 7: శైవ క్షేత్ర వ్యవస్థాపక పీఠాధిపతులు శివ స్వామి తో కలిసి తాళ్లాయపాలెం శ్రీరామ శోభాయాత్రలో శ్రీ నారాయణ స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ పాములపాటి మాధవ్ ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరామ శోభాయాత్ర బి.ఆర్.టి.యస్ రోడ్డు రామకోటి దగ్గర నుండి శివాజీ సెంటర్లోని ముత్యాలంపాడు గవర్నమెంట్ ముద్రనాలయం మీదుగా అసిత్ నగర్ వరకు శ్రీరామ భక్తులతో కన్నుల పండుగగా సాగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలపాటి సత్యనారాయణ, దేవరపు మాలాద్రి, పాములపాటి నరేంద్ర, ప్రసాద్ సింగ్, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి చెలామణి చేస్తున్న నలుగురు అరెస్ట్...

**నాలుగు కిలోల గంజాయి స్వాధీనం.**

**పిల్లలు దారి తప్పకుండా తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలి**

**సి ఐ చావా హాజరత్తయ్య పిలుపు.**







సింగరాయకొండ : అస్త్రంన్యూస్: దురలవాట్లు, చెడు స్నేహాలకు అలవాటై జీవితాలను చెడగొట్టు కుంటున్న పిల్లల భవిష్యత్ పట్ల తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సింగరాయకొండ సిఐ చావా హాజరత్తయ్య పిలుపు ఇచ్చారు. సోమవారం సింగరాయకొండ సర్కిల్ కార్యాలయం లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఒంగోలు లో ఇంజనీరింగ్ విద్యార్థి ఒకరు మాదక ద్రవ్యాలకు పాల్పడి గంజాయి చెలామణి చేస్తున్న ముఠాతో జత కట్టి భవిష్యత్ ని చెడగొట్టు న్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా ఎస్పీ దామోదర్, ఒంగోలు డిఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు స్వీయ పర్యవేక్షణ లో సింగరాయకొండ సర్కిల్ పరిధిలోని టోల్ ప్లాజా వద్ద టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వర రావు ఆధ్వర్యంలో పోలీస్ లు చేపట్టిన వాహన తనిఖీల్లో అక్రమంగా గంజాయి చెలామణి,తరలింపు చేస్తున్న నలుగురు సభ్యుల ముఠా గుట్టు రట్టయిందన్నారు. గంజాయి తరలిస్తున్న రాజుగారి తోట గుంటూరు కి చెందిన గాజుల రాజు,చిత్తూరు జిల్లా అంజూరు కి చెందిన పల్లం కిరణ్,ఒరిస్సా రాష్ట్రం కోరాపుట్ కి చెందిన బీమా కోరా, ఖాజు కిలా లను అరెస్టు చేసి రిమాండ్ కి పంపడం తో పాటు వారివద్ద నుండి స్వాధీనం చేసుకున్న నాలుగు కిలోల గంజాయి ని స్వాధీనం చేసుకుని కోర్టుకి పంపినట్లు ఆయన వివరించారు. ఇంజనీరింగ్ విద్యార్థి గా ఉంటూ చెడు అలవాట్లు మత్తు పదార్థాలకు బానిసై ఈ ముఠా తో చేతులు కలిపి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నాడని విచారణ సందర్భంగా తెలియడం తో ఆందోళన కలిగిందన్నారు. ఇలా యువకులు, విద్యార్థులు మత్తు కి అలవాటు పడుతున్నారని ఇలా పక్కదారి పట్టకుండా తల్లిదండ్రులు, ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు బాధిత తీసుకుని అలాంటి వాటిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలని సిఐ హాజరత్యయ్య హితవు పలికారు. టంగుటూరు టోల్ ప్లాజా కేంద్రంగా చెలామణి అవుతున్న గంజాయి సరఫరా ముఠాని పట్టుకోవడం లో ప్రత్యేక దృష్టి పెట్టి అదుపులోకి తీసుకున్న టంగుటూరు ఎస్సై నాగమల్లేశ్వర తో పాటు ఆయన సిబ్బంది వెంకటరావు, ఎం వి కృష్ణారావు,శ్రీను,సుబ్బారెడ్డి,మహేష్, నాగార్జున,జయరాం, రమేష్ లను ఎస్పీ ఎ ఆర్ దామోదర్, డి ఎస్ పి రాయపాటి శ్రీనివాసరావు, సిఐ చావా హాజరత్తయ్య అభినందించారు.

# వైయస్ఆర్ సీపీ శ్రేణులకుఅండగా ఉంటాం-ఇంచార్జి దద్దాల






చంద్రశేఖరపురం, అస్త్రం ఏప్రిల్ 7: సోమవారం మండల కమిటీలకు సంబందించి ఏర్పాటు చేసిన సియస్ పురం మండలం కార్యకర్తలు సమావేశంలో ముఖ్య అతిథిలుగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మరియు మాజీ శాసన సభ్యులు కదిరి బాబురావు పాల్గొన్నారు..ఈ సందర్భంగా ముందుగా ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ గారికి బాణాసంచా,పూల జల్లులతో, కేరింతల నడుమ కొలహాలముగా ఘన స్వాగతం పలికి చెరువు కట్ట వద్ద నుండి కళ్యాణ మండపం వరకు మండల వైసీపీ నాయకులు ర్యాలీ నిర్వహించారు.. సమావేశం లో ముందుగా మాజీ ముఖ్యమంత్రి వర్యులు వైయస్ఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.అనంతరం ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి విచ్చేసిన మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు గారికి, వైసీపీ నాయకులు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేసి మండల అధ్యక్షులు గా ఎన్నికైన పాలగుళ్ల మల్లికార్జున రెడ్డి గారికి అభినందనలు తెలిపారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి ఇంచార్జి దద్దాల మాట్లాడుతూ పార్టీ అధినాయకుడు జగనన్న ఆదేశాల మేరకు నియోజకవర్గం అన్ని మండలాలకు కమిటీలు ఏర్పాటు చేస్తున్నామని,అదేవిదంగా జిల్లా పార్టీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి ఆదేశాలతో, పార్లమెంట్ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి అధ్యక్షతలో,రీజనల్ కో-ఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరావు పర్యవేక్షణలో మరియు మన నియోజకవర్గం నాయకులు కదిరి బాబురావు, చింతలచెరువు సత్యనారాయణ రెడ్డి సూచనలు, సలహాలతో,అందరి సీనియర్ నాయకులు సలహాలతో ఈ కమిటీలు ఏర్పాటు చేయటం జరుగుతుంది అని అన్నారు..కమిటీ లో సుమారు 450 మందికి పైగా పార్టీ అవకాశం కలిపిస్తుంది అందురూ పార్టీ ఎదుగుదలకు దోహదపడాలని సూచించారు..కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీల అమలులో పూర్తిగా విఫలం అయినది అని, నియోజకవర్గం అందరికీ అండగా ఉంటానని ఓడిపోయిన మరుక్షణం నుండే నియోజకవర్గం లో పర్యటిస్తూనని అందరం కలిసి కట్టుగా పనిచేసి రాబోయే ఎన్నికల్లో కనిగిరిలో పార్టీ జెండా ఎగురవేసి జగనన్నను ముఖ్యమంత్రి చేసుకుందామని పిలుపినిచ్చారు.. జగనన్న 2.0 లో కార్యకర్తలకే మొదటి ప్రాధాన్యత ఉంటుంది అని తెలిపారు.

ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా వచ్చిన మాజీ శాసన సభ్యులు కదిరి బాబురావు మాట్లాడుతూ చివరివరకూ వైసీపీ లోనే కొనసాగుతానని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలిచేవిధంగా కష్టపడాలి అని సూచించారు. మండల అధ్యక్షులు పాలగుళ్ల మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ నాకు ఈ అవకాశం కలిపించిన పార్టీ అధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి గారికి, బూచే పల్లి శివప్రసాద్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, కారుమూరి నాగేశ్వరావు, ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు మరియు మండల వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.. మండలం లో పార్టీ అభివృద్ధికి, పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తానని తెలిపారు.. మండల వైసీపీ నాయకులు దుశ్శాలువ, పూలదండతో దద్దాల నారాయణ యాదవ్, కదిరి బాబురావు, పాలగుళ్ల మల్లికార్జున రెడ్డి ని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు,మండల అధ్యక్షులు పాలగుళ్ల మల్లికార్జునరెడ్డి,మేకల శ్రీనివాసు యాదవ్,దుగ్గిరెడ్డి ప్రతాప్ రెడ్డి,ముత్యాల నారాయణరెడ్డి,భూమిరెడ్డి వెంకటరెడ్డి, భువనగిరి వెంకటయ్య,బైరెడ్డి తిరుపతి రెడ్డి,దుగ్గిరెడ్డి జయరెడ్డి,షేక్ బుజ్జి,మితికేల గురవయ్య, గుంటక తిరుపతి రెడ్డి, కల్లూరి రామిరెడ్డి,పులి శాంతి, తమ్మినేని సుజాత, గట్ల విజయభాస్కర్ రెడ్డి, అంబటి కొండారెడ్డి,షేక్ చాంద్ బాషా, షేక్ నాయబ్ రసూల్,శ్రీరామ శ్రీనివాసులు,జొన్నలగడ్డ గోవిందయ్య,జొన్నలగడ్డ ప్రహల్లాద్,అంచూరి సత్యం రెడ్డి,కోడూరి లక్ష్మి నారాయణ రెడ్డి,ఇండ్ల బాలయ్య,బొర్రాజు రమణయ్య,చెరుకుపల్లి రాధారెడ్డి,వై.ప్రవీణ్ కుమార్,సర్పంచ్ బాబు,అంబాల శేఖర్,పులి మాల్యాద్రి, పులి రామచంద్రయ్య,మన్నెపల్లి పెద్దన్న,ముడమాల నారాయణ రెడ్డి,యనమల పెద్ద సుబ్బయ్య,మర్రి రామయ్య,వసంత రాజు,కత్తులపల్లి రమణారెడ్డి, చెన్నుపూడి ప్రకాష్ రెడ్డి,మేకల బాలు,బొట్ల చిరంజీవి,దుగ్గిరెడ్డి రమణారెడ్డి,గడ్డం రంగారెడ్డి,డాక్టర్ గౌస్,జిఎల్ న్ రెడ్డి,అంజిరెడ్డి, మన్నెపల్లి రవి,వాసు, అశోక్,తోట రమేష్,గోడపురెడ్డి రమణారెడ్డి,గాండ్లపర్తి ఆదినారాయణరెడ్డి,సిరుప గోవర్ధన్ రెడ్డి,ఆవుల భాస్కర్ రెడ్డి, ఓకే రెడ్డి, వాకమళ్ల రాజశేఖర్ రెడ్డి,డాక్టర్ ఆవుల కృష్ణారెడ్డి,ఏకుల సుబ్బారెడ్డి,వీరంరెడ్డి, బ్రహ్మారెడ్డి,యర్రబల్లి దేవరాజ్,ముల్లంగి శ్రీహరి రెడ్డి, సంగటి మహేంద్ర రెడ్డి, ఏకుల రుద్ర,తమ్మినేని ఉమా శంకర్ రెడ్డి,తాతపూడి సురేష్,గోనా జేమ్స్,తాతపూడి నాని,గంజి రవీంద్ర రెడ్డి, ఈర్ల శ్రీను, కంటూ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్బందులు పెట్టిన డి టి ఆర్ యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు

చీడికాడ అస్త్రం ప్రతినిధి : చీడికాడ మండల కేంద్రంలో గల విద్యుత్ ఉప కేంద్రంలో డి టి ఆర్ (లింబ్) మరమ్మతులకు గురి కావడంతో విద్యుత్ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టారు. సంఘటనకు సంబంధించి ఉపకేంద్రం ఏఈ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చీడికాడ సబ్స్టేషన్లో డి టి ఆర్ (లింబ్) మరమ్మతులకు గురి కావడంతో విద్యుత్ సరఫరా నిలిపివేసిన యధావిధిగా విద్యుత్ సరఫరా జరుగుతుందని దీనివల్ల ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందన్నారు. ఈ సమస్యపై ఏడి సురేష్ కు సమాచారం అందించగా ఆయన స్పందించి ప్రొటెక్షన్ సిబ్బందికి తెలపడంతో ప్రొటెక్షన్ ఏఈ షేక్ అబ్దుల్ రహీం తన సిబ్బందితో వచ్చి మరమ్మత్తులు చేసి సమస్యను పరిష్కరించారన్నారు. ఈ కార్యక్రమంలో ఎల్ఐ, ఎల్ ఎం వరహాలు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.



5
సామాన్యుడి ఆయుధం
అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం 8-4-2025

# మన్యంలో రహదారులకు ప్రత్యేక చర్యలు

## గిరిజన ప్రాంతంలో రోడ్డున నిర్మాణానికి 1005 కోట్లు మంజూరు.

## గిరి యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి.




డుంబ్రిగూడ అస్త్రం ప్రతినిధి: గిరిజన గ్రామాల్లో రహదారణ నిర్మాణానికి ప్రత్యేక చర్యలు తీసుకోవడమే కాకుండా1005 కోట్లు కేటాయిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రకటించారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గ కేంద్రం డుంబ్రిగుడ మండలం పెదపాడు గ్రామంలో సోమవారం రాష్ట్ర ఉపముఖ్యమంత్రి పంచాయతీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ విస్తృతంగా ప్రకటించారు. షెడ్యూల్ ప్రకారం విశాఖపట్నం విమానాశ్రయం నుండి కొత్తవలస, ఎస్ కోట, అనంతగిరి, అరకు మీదుగా రోడ్డు ప్రయాణం లో ముందుగా 11:30 కు చాపరాయి జలతరంగిని లో దిగి శాంతాలమ్మ దేవతను దర్శించుకుని అక్కడ కొంతసేపు ముచ్చటించి చాపరాయి వాగును దాటి పెదపాడు పి.టి.జి గ్రామానికి చేరుకొని అక్కడ ప్రజలతో మమేకమై ప్రధానమంత్రి గ్రామ సడక్ యోజన పథకంలో భాగమైన 1005 కో ట్ల1069 కిలోమీటర్లు తారురోడ్ల పనులకు సంబంధించినా శిలాఫలకాలను ఆవిష్కరించారు.1069 కిలోమీటర్ల మేర నిర్మాణం పనులకు సంబంధించిన పనులకు శంకుస్థాపన చేశారు. అక్కడ నుండి బయలుదేరి నేరుగా డుంబ్రిగుడ గిరిజన బాలికల పాఠశాల సభా ప్రాంగణం వద్ద చేరుకోగానే సభకు విచ్చేసిన జనసైనికులు కూటమి కార్యకర్తలు ప్రజలు మహిళలు హర్షధ్వనుల తో ఈలలు చప్పట్లతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి వర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్ సభను ఉద్దేశిస్తూ గిరిజన ప్రాంతంలో గిరిజనులు రోడ్లు లేక సరైన రహదారి సౌకర్యం లేక కొండలు గుట్టలు నడుచుకుంటూ కఠినమైన ప్రయాణాలు కొనసాగిస్తున్నారు.రోడ్డు సౌకర్యం లేక పనుల మీద వెళ్లాలంటే కొండలు గుట్టలు నడుచుకుంటూ చాలా గ్రామాలలో రోడ్డు సౌకర్యం లేక హాస్పిటల్స్ కు గర్భిణీలు తీసుకెళ్లాలి అన్న 108 అంబులెన్స్ గ్రామం లో రాకపోవడంతో డోలితో మోసుకొని ఆసుపత్రి కి తీసుకొని వెళ్లాలి.అందుకు కూటమి ప్రభుత్వము వచ్చిన తొమ్మిది నెలల్లోనే 1069 కిలోమీటర్ల మేరకు గిరిజన ప్రాంతంలో రోడ్లు వేయాలని 1005 కోట్లు మంజూరు చేయడం జరిగింది.అదే మాదిరిగా చాపురాయి జలపాతం వద్ద గిరిజనులు వంతెన కట్టాలని కోరగా ఇక్కడ వంతెన చాలా సుందరంగా అందంగా గిరిజనులకు ఉపయోగకరంగా టూరిస్టులకు అనుకూలంగా ఉండేలా తీర్చిదిద్దాలని అందుకు నాకు రెండు నెలలు సమయం కావాలని కోరారు. అదే సందర్భంలో గిరిజన ప్రాంతంలో ఉన్న నిరుద్యోగులను ఉద్దేశిస్తూ గిరిజన యువత గంజాయి మహమ్మారి బారిన పడి విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అది పండించడం చట్టరీత్యా నేరమని ఆ చెడు వ్యసనాలను మానుకొని మంచి ఆలోచన మంచిగా బ్రతకాలని కోరారు. గిరిజన ప్రాంతంలో టూరిజంకు అనువైన ప్రాంతం అందుకు టూరిజం అభివృద్ధి చేస్తే అందులో నిరుద్యోగులకు ఉపాధి కల్పించే అవకాశాలు ఉన్నాయి. పరిశ్రమాలు పెట్టాలంటే అవకాశం లేదు కనుక టూరిజం ముందు అభివృద్ధి చేసుకుంటూ నిరుద్యోగులకు అవకాశాలు కల్పించవచ్చు అంటూ ముగించారు. అక్కడ నుండి ఆరుకువేలి హరిత రిసర్ట్స్ లో భోజనంచేసి సాయంత్రం 5.30 కు ప్రభుత్వ డిగ్రీ కాలేజీ గ్రౌండ్ లో 2000 ల మంది విద్యార్థుల తో సూర్య వందనం కార్యక్రమం లో పాల్గొన్నారు.



### గిరిజన నిరుద్యోగులకు నిరాశ

గిరిజన ప్రాంతంలో పర్యటిస్తున్న డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వచ్చి గిరిజన నిరుద్యోగుల ఆయువుపట్టు అయినా జీవో నెంబర్ 3ను గూర్చి ప్రస్తావిస్తారని సభ వద్ద ఎన్నో ఆశలతో ఎదురుచూసిన నిరుద్యోగులకు నిరాశ మిగిలింది. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ నిజంగానే గిరిజన బిడ్డల మీద ప్రేమ ఉంటే రేపటికైనా జీవో నెంబర్ 3 గురించి క్లారిటీ ఇవ్వాలని గిరిజన నిరుద్యోగులకు ఉపాధి అవకాశాల కోసం చర్యలు తీసుకోవాలని గిరిజన నిరుద్యోగులు కోరుతున్నారు.



# స్మార్ట్ మీటర్లు రద్దుచేయాలి

## విద్యుత్ చార్జీలు తగ్గించాలనీ వాల్ పోస్టర్

## సిపిఎం మండల కమిటీ

పాచిపెంట అస్త్రం ప్రతినిధి: స్మార్ట్ మీటర్లు రద్దుచేసి కరెంటు చార్జీలు తగ్గించి ప్రజలపై భారాల ఆపాలని సిపిఎం పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో పాచిపెంట మండల కేంద్రం గాంధీ బొమ్మ ఆవరణలో గోడ పత్రిక ఆవిష్కరించారు. కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ వారాలు వేసి స్మార్ట్ మీటర్లు వ్యతిరేకిస్తూ ప్రజలంతా పోరాడాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కోరాడ ఈశ్వరరావు సిపిఎం మండల నాయకులు బోను గౌరు నాయుడు మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రతిపక్షంగా ఉండేటప్పుడు మేము అధికారంలోకి వస్తే కరెంటు చార్జీలు పెంచబోమని చెప్పి ప్రజలను నమ్మించి నేడు అధికారంలోకి వచ్చాక బాదుడే బాదుడిగా అన్ని రకాల నిత్యావసర వస్తువులు ధరలను పెంచి సామాన్య ప్రజలపై భారాలవేయడం చేస్తుందని అన్నారు. ఇప్పటికే పెరిగిన ధరలతో ప్రజలు భరించలేని ఇబ్బందులు పడుతుంటే మరల ప్రజలపై సెల్ఫోన్ రీఛార్జ్ వలే స్మార్ట్ కరెంట్ మీటర్లు ఇళ్లకు ఏర్పాటు చేసి మరింత ఆర్థిక భారాలు వేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమని ఆవేదన వ్యక్తజరిగింది. ప్రభుత్వం ప్రజలపై మోపిన ట్రు అఫ్ చార్జీలను ఉపసంహరించాలని సఖి ఒప్పందాలను రద్దుచేసి స్మార్ట్ మీటర్లు పెట్టే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు.కేంద్ర ప్రభుత్వం ఒకపక్క వ్యవసాయ రంగాన్ని నాశనం చేసే విధానాలు తీసుకొస్తే కేంద్రానికి మద్దతుగా కూటమి ప్రభుత్వం మరింత పోటీ పడుతూ ప్రజలపై భారాలను వేస్తోందని దీన్ని తీవ్రంగా ప్రజలంతా ఖండించాలని భవిష్యత్ పోరాటాలకు ప్రజలంతా సిపిఎంతో కలిసి రావాలని కోరుతూ ఈ కార్యక్రమం చేయడమనే జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు దిసరి బుచ్చియ్య,ఆటో కార్మిక సంఘం నాయకులు టి శంకర్రావు,పి వసంత, బదనాన రవి,పి రంజిత్, జన అప్పారావు తదితరులు పాల్గొన్నారు. గాంధీ బొమ్మ వద్ద కరెంటు చార్జీలు తగ్గించాలని స్మార్ట్ మీటర్లు పెట్టొద్దని వ్యవసాయ రంగాన్ని కాపాడాలని కోరుతూ సిపిఎం ఆధ్వర్యంలో విడుదల చేశారు.

# నిర్లక్ష్యంగా వాహనం నడిపిన వ్యక్తి మృతి

## కేసు నమోదు దర్యాప్తు





ముంచింగి పుట్టు అస్త్రం ప్రతినిధి : యువకుడు నిర్లక్ష్యంగా వాహనం నడిపి కొండ నుండి కొట్టి ప్రమాదానికి గురై మృతి చెందిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. మృతుని కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు విలేకరులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రంగిని గూడ గ్రామం బొండం పంచాయతీ అరకువేలి మండలానికి చెందిన రాంబాబు సువాబి, గణేష్ కిల్లో, గోవింద్ అను వ్యక్తులు బజాజ్ పల్సర్ ఏపీ39 జై జై6561 మోటార్ సైకిల్ పై లబ్బురు గ్రామంలో అతని స్నేహితుల ఇంటికి వెళ్లి తిరిగి :07-04-2025 న ఉదయం 04 గంటల సమయంలో తిరిగి వారి స్వగ్రామానికి వెళుతున్న సమయంలో దోడిపుట్ గ్రామ సమీపంలో కరండీ కుప్పకుండా వద్ద మోటార్ సైకిల్ నడుపుతున్నటువంటి సిరగం రాంబాబు తన మోటార్ సైకిల్ ని నిర్లక్ష్యంగా స్పీడుగా అజాగ్రత్తగా నడపడంతో మలుపు వద్ద వాహనం కొండని గుద్దుకొని సువాబి గణేష్ అక్కడికక్కడే మరణించగా మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలు అవడంతో బాధితులకు మెరుగైన చికిత్స కోసం కేజీహెచ్ ఆసుపత్రికి తరలించడం జరిగిందని సంఘటనపై సువాభి గణేష్ తండ్రి సువాబి సింహాచలం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కె కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# ఎస్పీ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కు 42 ఫిర్యాదులు

## దివ్యాంగుల ఫిర్యాదుపై నేరుగా వారి వద్దకే వెళ్లి సమస్యలు విన్న జిల్లా ఎస్పీ





అనకాపల్లి, అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో: అనకాపల్లి జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 42 ఫిర్యాదులు అందాయి. వీటిలో ఆస్తి తగాదాలు, కుటుంబ కలహాలు, మోసపూరిత వ్యవహారాలు మొదలైన సమస్యలు ఉన్నట్లు గుర్తించారు.కోటవురట్ల మండలం, ఎండపల్లి గ్రామానికి చెందిన దివ్యాంగులు గుడివాడ వరలక్ష్మి, కుమార్, వెంకట్ ల ఫిర్యాదుపై ప్రత్యేకంగా స్పందించిన జిల్లా ఎస్పీ గారు, నేరుగా వారి వద్దకే వెళ్లి సమస్యలు విన్నారు. కోటవురట్ల మండలం, అన్నవరం గ్రామానికి చెందిన నిందితుడు నక్క మాణిక్యం, జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం ఇప్పిస్తానని మోసం చేసి రూ.10,50,000/- కాజేశాడని బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై తక్షణమే కేసు నమోదు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులకు ఎస్పీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో, జిల్లా ఎస్పీ గారు స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించి, వారితో ముఖాముఖిగా మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా, ఫిర్యాదులన్నింటిపైనా చట్టపరంగా విచారణ జరిపి బాధితులకు న్యాయం చేస్తామని, సమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహన రావు, ఎస్సై డి.వెంకన్న పాల్గొన్నారు.

సామాన్యుడి ఆయుధం
ప్రజల అస్త్రం
T/AP/2024/0304/1072/41
ANDHRA PRADESH
prajalaastram999@gmail.com
విశాఖపట్నం | అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు జిల్లా
మంగళవారం 8-4-2025

# ద్విచక్ర వాహనాల దొంగలు అరెస్ట్

### వివరాలు వెల్లడించిన డిఎస్పి ఎం. శ్రావణి

బుచ్చయ్యపేట, అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో : ద్విచక్ర వాహనాలను దొంగలిస్తున్న వ్యక్తులను బుచ్చయ్యపేట పోలీసులు అరెస్టు చేశారని అనకాపల్లి డిఎస్పి శ్రావణి వివరించారు. సంఘటనకు సంబంధించి డిఎస్పి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.వివిధ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు చేస్తున్న వ్యక్తులను పట్టుకొని అరెస్ట్ చేసినట్లు అనకాపల్లి డిఎస్పి ఎం. శ్రావణి తెలిపారు. సోమవారం బుచ్చయ్యపేట పోలీస్ స్టేషన్ లో డిఎస్పి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డిఎస్పి ఎం. శ్రావణి మాట్లాడుతూ బుచ్చయ్యపేట స్టేషన్ పరిధిలోనే కాకుండా అనకాపల్లి, విశాఖపట్నం జిల్లా ల్లో బుచ్చయ్యపేట, చోడవరం, రావికమతం, వడ్డాది, అనకాపల్లి టౌన్, దువ్వాడ, కంచరపాలెం, విశాఖపట్నం ఫోర్త్ టౌన్ ప్రాంతాల్లో బైక్ దొంగతనాలు కు పాల్పడుతున్న వ్యక్తులు ను బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట సమీపంలోని వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ముగ్గురు వ్యక్తుల్ని అదుపులో అదుపులోనికి తీసుకొని విచారించగా విజయరామరాజుపేట గ్రామానికి చెందిన ఈ ముగ్గురు వ్యక్తులు వివిధ ప్రాంతాల్లో 9 బైకులు దొంగతనం చేసినట్టుగా పోలీసులు ఎదుట ఒప్పుకున్నారని తెలిపారు. దీంతో బుచ్చయ్యపేట పోలీసులు లోతైన విచారణ జరిపి 9 బైకులను స్వాధీనం చేసుకున్నారు. బైకు దొంగతనాలకు పాల్పడిన వేగి వెంకటేశు, పెంటకోట చిరంజీవి, భీమరశెట్టి నాని లను అరెస్ట్ చేశామని



అనకాపల్లి డిఎస్పి ఎం. శ్రావణి మీడియాకు సమాచారం అందించారు. ఈ కార్యక్రమం లో స్థానిక ఎస్సై ఏ. శ్రీనివాసరావు, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

## బీరు బాటిల్తో పొడిచి చంపిన స్నేహితులు

### దొంగ సొమ్ము వాటాల్లో వివాదం

### పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు



రావికమతం అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో: అనకాపల్లి జిల్లా రావికమతం మండలం గ్రామ సమీపంలో దారుణం చోటుచేసు కుంది. నలుగురు యువకులు చిన్న చిన్న చోరీలకు పాల్పడుతూ వచ్చిన డబ్బుల్లో వాటాల్లో తేడా వచ్చిందని మిగతా ముగ్గురు కలిపి కూలిపాక పవన్ కుమార్ (23) అనే యువకుడ్ని బీరు బాటిల్ తో పొడిచి చంపారు. మేడివాడ కు చెందిన పవన్ ను అక్కడి తిరుమల ఫంక్షన్ హాల్ వద్ద ఆదివారం అర్ధరాత్రి అందరూ మద్యం సేవిస్తుండగా డబ్బుల విషయంలో తేడా వచ్చింది. దీంతో ఆ ముగ్గురు కలిసి పవన్ ను హత్య చేశారు. హత్యకు కారణమైన ఆ ముగ్గుర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. మృతుడి తండ్రి త్రిమూర్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

## వీధి కుక్కలకు వ్యాక్సినేషన్ వేయండి

### జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్



విశాఖపట్నం అస్త్రం ఉత్తరాంధ్ర బ్యూరో : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ పరిధిలోని స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలకు యాంటీ రేబిస్ వ్యాక్సినేషన్ వేయాలని జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ ఇ.ఎన్.వి.నరేష్ కుమార్ జీవీఎంసీ వెటర్నరీ డాక్టర్లను ఆదేశించారు. సోమవారం ఆయన జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని ఆయన చాంబర్లో జీవీఎంసీ సిటీ వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ ఎన్. కిషోర్ తోపాటు ఇతర వెటర్నరీ డాక్టర్ల తో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన వైద్యాధికారి మాట్లాడుతూ గుంటూరులో వీధి కుక్కల దాడిలో బాలుడు మరణించాడని, ఇటువంటి సంఘటనలు జరగకుండా మన విశాఖ నగరంలో వీధి కుక్కల నియంత్రణకు తగు చర్యలు చేపట్టాలని, రేపటి నుండి ప్రత్యేక స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వీధి కుక్కలు అధికంగా ఉన్న ప్రదేశాలను గుర్తించి వాటి నియంత్రణకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ లతోపాటు యాంటీ రాబిస్ వ్యాక్సినేషన్ వేయాలని జీవీఎంసీ వెటర్నరీ డాక్టర్లను ఆయన ఆదేశించారు.

## సుప్రీంలో మిథున్ రెడ్డికి ఊరట

### తదుపరి విచారణ వరకు అరెస్ట్ చేయవద్దు


### పోలీసులకు సుప్రీం ఆదేశాలు

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డికి సుప్రీంకోర్టులో ఊరట దక్కింది.. మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ కేసులో ఏపీ పోలీసులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ పిటిషన్‌పై తదుపరి విచారణ వరకు మిథున్‌రెడ్డిని అరెస్ట్ చేయవద్దని ఆదేశాలు ఇచ్చింది.. మధ్యంతర రక్షణ కల్పిస్తూ సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చింది.. మిథున్ రెడ్డి తరపున వాదనలు వినిపించారు సీనియర్ న్యాయవాది అభిషేక్ సింఘ్వి.. ఈ పిటిషన్‌పై జస్టిస్ జేబీ పార్దివాలా, జస్టిస్ ఆర్. మహదేవన్ ధర్మాసనం విచారణ జరిపింది.. కాగా, మద్యం అమ్మకాలపై సీఐడీ కేసులో ముందస్తు బెయిల్ కోరుతూ సుప్రీంకోర్టులో ఎంపీ మిథున్ రెడ్డి పిటిషన్ దాఖలు చేశారు.. ఏపీ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాలు చేశారు మిథున్ రెడ్డి.. కాగా, మద్యం కొనుగోళ్ల వ్యవహారంలో ఆంధ్రప్రదేశ్ సీఐడీ నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ గత నెలలో హైకోర్టును ఆశ్రయించారు మిథున్‌రెడ్డి.. ఆ పిటిషన్‌పై విచారణ సమయంలో సీఐడీ తరుపు న్యాయవాది మద్యం విధానంపై దర్యాప్తు తొలిదశలోనే ఉందని హైకోర్టుకు తెలియజేశారు.. ఎంపీ మిథున్‌రెడ్డిని నిందితుడిగా పేర్కొనలేదని చెప్పుకొచ్చారు.. దీంతో, ఎంపీ మిథున్‌రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్‌ను ఏపీ హైకోర్టు డిస్మిస్ చేసింది.

## అక్రమ క్వారీపై కలెక్టర్ కు ఫిర్యాదు



చోడవరం అస్త్రం ప్రతినిధి: చోడవరం జనసేన పార్టీ ఇన్-చార్జ్, పివిఎస్ఎన్ రాజు, అనకాపల్లి కలెక్టర్ కార్యాలయంలో రాజన్నపేట గ్రామంలో అక్రమ క్వారీ మైనింగ్ పై స్పందనఫిర్యాదు చేశారు.రాజు వ్యక్తిగతంగా అనకాపల్లి జిల్లా కలెక్టర్, విజయ కృష్ణన్‌కు ఫిర్యాదు సమర్పించారు, క్వారీ యజమానులు వ్యవసాయ చెరువు మధ్య నుండి అనధికారిక రహదారి నిర్మించారని, ఇది రైతుల పంటలపై తీవ్ర ప్రభావం చూపుతున్నందున, రెవిన్యూ మరియు నీటి పారుదల శాఖల ఆదేశాలు జారీ అయ్యే వరకు కార్యకలాపాలను నిలిపివేయాలని తెలిపినప్పటికీ క్వారీ లీజుదారులు ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తూ అధిక సామర్థ్యపు పేలుడు పదార్థాలను వాడడం వలన శబ్ద కాలుష్యం మరియు క్వారీ చుట్టూ ఉన్న ఇళ్ల మరియు వ్యవసాయ భూములకు నష్టం కలిగిస్తున్నాయని పేర్కొన్నారు. అనుమతించిన సామర్థ్యాన్ని మించి లోడెడ్ వాహనాలు నడుపుతూ వడ్డిప బుచ్చెంపేట గ్రామాలలో రోడ్లను తీవ్రంగా నాశనం చేస్తున్నాయని తెలిపారు.ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ ఈ అక్రమ కార్యకలాపాల దుష్ఫలితాలను ప్రజలు ఎందుకు భరించాలి అని మరియు వారు ఈ మైనింగ్ వల్ల వారికి వచ్చే లాభం ఏమిటని ప్రశ్నించారు. మైనింగ్, రెవిన్యూ , నీటి పారుదల పంచాయతీ రాజ్ విభాగాలు క్వారీ లీజుదారుల చేస్తున్న అక్రమాలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని అడిగారు. ప్రజల ప్రయోజనాల పరి రక్షణ కోసం కోసం క్వారీ ఆపరేటర్లపై తక్షణ చర్య తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు.



## బంగాళాఖాతంలో అల్పపీడనం

### తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశం

### 10, 11 తేదీల్లో పలు జిల్లాల్లో మోస్తరు వర్షాలు

అమరావతి: ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తనం ప్రభావంతో సోమవారం దక్షిణ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడింది. ఇది మంగళవారం నైరుతి బంగాళాఖాతం వైపు కదిలే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఆ తర్వాత 48 గంటల్లో ఉత్తర దిశగా మయన్మార్ తీరం వైపు ప్రయాణిస్తుందని పేర్కొంది. ఇది తీవ్ర అల్పపీడనంగా బలపడే అవకాశం ఉందని అంచనా వేస్తోంది.దీని ప్రభావంతో 10, 11 తేదీల్లో ఉత్తరాంధ్ర జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని విపత్తు నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళ, బుధవారాల్లో కూడా కొన్నిచోట్ల అకస్మాత్తుగా పిడుగులతో కూడిన వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. సోమవారం ఏలూరు జిల్లా బుట్టాయగూడెం మండలంలోని పలు గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది. మరోవైపు పలుచోట్ల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం నంద్యాలలో అత్యధికంగా 41.5 డిగ్రీలు, కర్నూలు జిల్లా నడిచాగిలో 41.1, వైఎస్సార్ జిల్లా బలపనూరులో 41, ప్రకాశం జిల్లా నందనమారెళ్లలో 40.8, తిరుపతి జిల్లా గూడూరు, విజయనగరం జిల్లా నెలివాడలో 40.6, చిత్తూరు జిల్లా నగరిలో 40.5, అన్నమయ్య జిల్లా కంభంవారిపల్లె 40.4, పల్నాడు జిల్లా రావిపాడులో 40 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది.

## చీడికాడ మండలంలో బిజెపి నేతలు ఉన్నారా!???

### కనిపించని కార్యక్రమాలు???

### నిర్వహించని సభలు సమావేశాలు????

చీడికాడ అస్త్రం ప్రతినిధి : కేంద్రంలో భారతీయ జనతా పార్టీ ఒక స్థాయిని ఏర్పరచుకొని అభివృద్ధి పథకాలు అమలు చేస్తున్నప్పటికీ క్షేత్రస్థాయిలో నాయకత్వ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. కేంద్రంలో రాష్ట్రంలో పార్టీ ఉంటే గ్రామాల్లో పార్టీకి చెందిన కార్యకర్తలు నాయకులు కార్యక్రమాలు నిర్వహణకు దూసుకుపోతుంటారు. కానీ భారతీయ జనతా పార్టీ తరఫున కార్యకర్తలు ఉన్నారని, ఎన్నికలు జరుగుతున్నాయని, అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకుంటున్నామని, తెలుస్తుందే కానీ ఎక్కడ ఎటువంటి కార్యక్రమాలు జరిగిన దాఖలు కాగడ పెట్టి వెతికిన కనిపించడం లేదనే ఆరోపణలు అధికంగా వినిపిస్తున్నాయి. భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ప్రతి మండలంలో కార్యక్రమాల నిర్వహించి అయ్యా ప్రాంత విలేకరులకు సమాచారం అందించి కార్యక్రమాల నిర్వహించిన సంఘటనలు అనేకం కనిపిస్తున్నాయి. చీడికాడ మండలంలో కార్యకర్తల లోపమో, లేక విలేకరులు అనవసరమనే భావనలో బిజెపి కార్యవర్గం ఉందనే అభిప్రాయాలు లేకపోలేదు. మండలంలో ప్రచారాలు కానీ సభలు సమావేశాలు కానీ నిర్వహించిన సంఘటనలు కాగడా పెట్టి వెతికిన కనిపించడం లేదు, సరి కదా మొక్కుబడిగా నిర్వహించే కార్యక్రమాలను సైతం విలేకరులకు తెలపడం లేదని అభిప్రాయాలు లేకపోలేదు. ఇందుకు నిదర్శనమే సోమవారం చీడికాడ మండల కేంద్రంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండాను ఎగురవేశారు అని చెబుతున్నారే కానీ పత్రికలకు సమాచారం ఇవ్వడం కానీ ప్రజలను పిలవడం కానీ చేయలేదని పలువురు బాహటంగా చెబుతున్నారు. చీడికాడ మండలానికి బిజెపి తరఫున ఎన్నికైన నేత ఒకే ఒక్క విలేఖరికి సమాచారం ఇస్తున్నారే కానీ మిగిలిన వారికి ఇవ్వడం లేదని అడిగితే నేను చూసుకుంటానని అంటున్నారని బిజెపి నేతలే బాహటంగా చెబుతున్నారు. సదరు నేత తీరు వల్ల మండలంలో బిజెపి పరిస్థితి ఏంటనే అభిప్రాయాలు తలెత్తుతున్నాయని బిజెపి నేతలే అభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ఇటువంటి సమస్యలపై జిల్లా అధిష్టానం దృష్టి సారించి మండలంలో పార్టీ తరఫున కార్యక్రమాలు నిర్వహించడం, జరుగిన కార్యక్రమాలు ప్రజలకు తెలిసే విధంగా చర్యలు తీసుకోవాలని మండలంలోని బిజెపి నేతలు కొంతమంది కోరుతున్నారు.

## ఉపాధ్యాయుడి ప్రాణాలు తీసిన ధూమపానం

ధూమపానం ఓ ఉపాధ్యాయుడి ప్రాణాలు హరించింది. మద్యం మత్తులో సిగరెట్ వెలిగించిన ఓ ఉపాధ్యాయుడు దానిని ఆర్పివేయకుండా అలాగే నిద్రలోకి జారుకున్నాడు. దీంతో సిగరెట్ వల్ల మంటలు చెలరేగి ఆ ఉపాధ్యాయుడి సజీవ దహనమయ్యాడు.ఈ ఘటన సూర్యాపేట జిల్లా కోదాడ మండలంలో చోటుచేసుకున్నది. పోలీసుల వివరాల ప్రకారం.. మండలంలోని మంగలి తండాకు చెందిన ధరావత్ బాలాజీ (52) నడిగూడెం మండలం చెన్నకేశవాపురం ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీరామ నవమి సందర్భంగా ఆయన భార్య ఇద్దరు పిల్లలను తీసుకుని పుట్టింటికి వెళ్లారు. ఇంట్లో ఒక్కడే ఉండడంతో మద్యం సేవించారు. సిగరెట్ తాగుతూ మంచంపై ఆరుబయట మంచంపై పడుకున్నారు. మత్తులో నిద్రలోకి జారుకోవడంతో సిగరెట్ మంచం నవారుపై పడి మంటలు చెలరేగాయి. దానికి కూలర్ గాలి తోడవడంతో భారీగా ఎగసిపడ్డాయి. చుట్టుపక్కల ఎవరూ లేకపోవడం, బాలాజీ మద్యం మత్తులో ఉండటంతో శరీరానికి మంటలు అంటుకుని అక్కడికక్కడే మృతిచెందారు. బాలాజీ భార్య శైలజ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఎం.అనిల్‌రెడ్డి తెలిపారు.